సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 11 । మే । 2025

దేశ రక్షణ కోసం...


గుంపెన రమేష్


రామలక్ష్మి

జూలూరుపాడు: మొద్దులగూడెంకు చెందిన గుంపెన రామస్వామి(లేటు), రామలక్ష్మి దంపతుల కుమారుడు రమేష్ ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ)లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నతనం నుంచే సైన్యంలో పనిచేయాలనే లక్ష్యంతో 18ఏళ్ల క్రితం చేరి, ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. యుద్ధం నేపథ్యాన ఎక్కడైనా విధులకు వెళ్లాల్సి ఉంటుందనే సమాచారం అంది నట్లు తెలిసింది. ఈ విషయమై ఆయన తల్లి రామలక్ష్మి స్పందిస్తూ దేశ రక్షణలో తన కుమారుడు పాలు పంచుకుంటుండడం ఆనందంగా ఉందన్నారు.

ఫోన్ చేశాకే తృప్తి


శోభాదేవి, అవినాష్‌రెడ్డి

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలం రెడ్డిగూడెంకు చెందిన సోమ వీరారెడ్డి - శోభాదేవి కుమారుడు అవినాష్‌రెడ్డి రైతు కుటుంబంలో పుట్టి ఆర్మీలో చేరాడు. 2015లో సైనికుడిగా ఎంపికైన ఆయన జమ్మూకశ్మీర్, లడక్, రాజస్తాన్‌లో విధులు నిర్వర్తించాక ప్రస్తుతం కలకత్తాలో ఉన్నాడు. యుద్ధం నేపథ్యాన సిద్ధంగా ఉండాలనే సంకేతాలు రావడంతో.. ప్రతీరోజు ఫోన్‌లో క్షేమ సమాచారం తెలుసుకునే వరకు ఆందోళన తగ్గడం లేదని అవినాశ్ తల్లి శోభాదేవి తెలిపారు. పాకిస్తాన్ పీచమణిచేలా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మనదే పైచేయి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

టీవీల్లో చూస్తుంటే భయం


లక్ష్మి, రాజేశ్‌రెడ్డి

పాల్వంచ మండలం రెడ్డిగూడెంకు చెందిన సామా నాగిరెడ్డి - లక్ష్మి దంపతుల కుమారుడు రాజేష్‌రెడ్డి బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూనే 2019లో ఆర్మీకి ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఆర్మీలో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా రాజస్తాన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. యుద్ధం నేపథ్యాన ఆయన తల్లి లక్ష్మిని పలకరించగా.. పాకిస్తాన్ యుద్ధం మొదలయ్యాక భయమేస్తుందని తెలిపారు. కుమారుడికి ఫోన్ చేస్తే తనకేమీ కాలేదని చెబుతున్నాడని పేర్కొన్నారు. అయినా టీవీలో యుద్ధ వార్తలు వింటుంటే ఆందోళనగా ఉండేదని తెలిపారు.

కశ్మీర్‌లోనే విధులు


అమ్మి, మాలోతు రవి

పాల్వంచ మండలం జగన్నాధపురానికి చెందిన గిరిజనులు మాలోతు భగవాన్ - అమ్మి ప్రథమ కుమారుడు రవి ఇంటర్ చదివాక 20ఏళ్ల క్రితం ఆర్మీలో చేరాడు. గతంలో శ్రీనగర్, మణిపూర్, కోల్‌కత్తా పనిచేయగా ప్రస్తుతం అస్సాంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యాన జమ్ముకశ్మీర్‌లో విధులు కేటాయించారు. ఈ సందర్భంగా తల్లి అమ్మి మాట్లాడుతూ యుద్ధం మొదలైనప్పటి నుంచి భయమేస్తున్నా దేశం కోసం పోరాడుతున్న కుమారుడిని చూస్తే గర్వంగా ఉంటుందని తెలిపారు. ప్రతీరోజు ఫోన్ చేసి జాగ్రత్తలు చెబుతామని పేర్కొన్నారు.

అందరి ఆశీర్వాదాలు...


వర్షా సురేష్, కళావతి

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురానికి చెందిన వర్షా కళావతి కుమారుడు సురేష్ సైన్యం విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రస్తుతం త్రిపురలో ఉన్నా, పరిస్థితుల కారణంగా అవసరమైన చోటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్న ఆదేశాలు వచ్చినట్లు తెలియడంతో ఆయన తల్లి కళావతి స్పందించారు. 'నా బిడ్డ సరిహద్దులో ఉంటూ దేశరక్షణకు పోరాడడం గర్వంగా ఉంది. సరిహద్దులో యుద్ధం కొంత ఆందోళన కలిగిస్తోంది. అయినా అందరి కోసం పోరాడుతున్ననా బిడ్డ సహా జవాన్లకు ఎందరో తల్లుల ఆశీర్వాదం ఉంటుంది' అని తెలిపారు.



అటు దేశభక్తి.. ఇటు తల్లిప్రేమ



- భారత సైన్యంలో ఉమ్మడి జిల్లా యువత
- కాల్పులు ఆగినా ఎప్పుడేం జరుగుతుందోనని తల్లడిల్లుతున్న కన్నపేగు
- మరోపక్క దేశ సేవలో తమ బిడ్డలు తరిస్తున్నారని సంతోషం

నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం

మాతృ దినోత్సవం

భారత్ – పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత అందరికీ ఆందోళన కలిగించింది. యుద్ధం ఎన్నాళ్లు కొనసాగుతుందోనన్న ఆదుర్దా సామాన్యుల్లో ఉండగా, సరిహద్దు వద్ద సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్న వారి కుటుంబాలను ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆవేదన వెంటాడింది. రెండు దేశాల అంగీకారంతో శనివారం సాయంత్రం కాల్పుల విరమణ ప్రకటించినా, మళ్లీ ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న భయం సైనికుల కుటుంబాలను వీడడం లేదు. ఈనేపథ్యాన నేడు(ఆదివారం) అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్న వారి తల్లులను పలకరించగా ఓ పక్క భయం.. ఇంకో వైపు ఆనందంతో కూడిన భావాలు వ్యక్తపరిచారు. తమ బిడ్డలు దేశసేవలో తరిస్తున్నారని సంతోషంగా ఉన్నా, యుద్ధం కారణంగా ఏం జరుగుతుందోనని ఆందోళన కూడా వారిలో కనిపించింది. అయితే, కన్నపేగుకు మించి తమ బిడ్డలు భారతమాత సేవలో ఉన్నారని హర్షం వ్యక్తం చేయడం విశేషం.

గర్వపడుతున్నాం...


బద్రి - చిన్న మంగ్యా


రాంబాబు

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం గాంధీనగర్‌కు చెందిన భూక్యా చిన్న మంగ్యా - బద్రి దంపతుల కుమారుడు భూక్యా రాంబాబు సైన్యంలో ఉద్యోగం చేస్తున్నాడు. డిగ్రీ చదువుకున్న రాంబాబు దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో పదేళ్ల క్రితం ఆర్మీలో చేరాడు. రాంబాబు ప్రస్తుతం జమ్మూ కాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తుండగా.. యుద్ధం నేపథ్యాన దేశరక్షణకు పాటుపడుతుండడం గర్వంగా ఉందని ఆయన తల్లి భద్రి తెలిపారు. అందరి కోసం పోరాడుతున్న తన బిడ్డకు ప్రజలందరి దీవెనలు ఉంటాయని బద్రి ధీమా వ్యక్తం చేశారు.

కొడుకు ఆశయానికి అండగా..


బచ్చల వంశీ, శారద

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం వెంకటేశ్వరకాలనీకి చెందిన బచ్చల వంశీకి నాలుగేళ్ల వయస్సు ఉన్నప్పుడు తండ్రి వెంకటేశ్వర్లు మృతి చెందారు. ఆతర్వాత తల్లి శారద కుమారుడి ఆలనాపాలన చూస్తోంది. భర్త లేకున్నా, ఒకే కుమారుడైనప్పటికీ సైన్యంలో చేరాలనే వంశీ సంకల్పానికి అండగా నిలిచింది. ఆయన 2019లో సైన్యంలోకి ఎంపికయ్యారు. యుద్ధం నేపథ్యాన శారద మాట్లాడుతూ కొడుకు ఎలా ఉన్నాడోననే ఆందోళన వెంటాడుతున్నా.. దేశరక్షణకు సైన్యంలో పనిచేస్తున్నాని తృప్తి ఉంటోందని తెలిపారు.

పుత్రోత్సాహం


వల్లోజు లక్ష్మీనారాయణ


సమ్మక్క

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం పోలారానికి చెందిన వల్లోజు లక్ష్మీనారాయణ ఆరేళ్ల క్రితం బీఎస్‌ఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. ప్రత్యేక పరిస్థితుల్లో కొంత కాలంగా ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వర్తిస్తుండగా.. పాకిస్తాన్‌తో యుద్ధం మొదలుకాగానే మళ్లీ సరిహద్దులకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన తల్లి సమ్మక్క స్పందిస్తూ.. పాకిస్తాన్‌తో యుద్ధ పరిస్థితులను టీవీలో చూస్తున్నానని తెలిపింది. దేశ రక్షణ విధుల్లో కుమారుడు ఉండడం తనలో పుత్రోత్సాహాన్ని నింపిందని, ఇది ఆనందంగానే కాక గర్వంగా ఉందని తెలిపింది.


విధుల్లో జగన్నాథపురానికి చెందిన మాలోతు రవి

అటు భయం.. ఇటు గర్వం


యజ్ఞకుమారి


ఉదయ్‌కుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని రామవరానికి చెందిన దాచేపల్లి ఖాదర్‌రాజు –యజ్ఞకుమారి కుమారుడు ఉదయ్‌కుమార్ జమ్మూలో మేజర్‌గా పనిచేస్తున్నారు. జవాన్‌గా చేరి మేజర్ స్థాయికి ఎదిగారు. ఆయన భార్య లక్ష్మీసత్య, ఏడాది కుమార్తె కూడా జమ్మూలోనే ఉండగా, వారి నివాసాని కి సమీపంలో బాంబులు పడ్డాయని సమాచారం ఇచ్చారు. ఉదయ్ తల్లి యజ్ఞకుమారి మాట్లాడుతూ ఇప్పుడు భయంగా ఉన్నా.. దేశ రక్షణలో కుమారుడు భాగస్వామ్యమైనందుకు గర్వంగా ఉందని తెలిపారు. దేశం కోసం దేనికైనా సిద్ధమేనని చెబుతాడని వెల్లడించారు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన


రామాలయంలో యాగం చేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.


శాంతి నెలకొనాలని యాగం

భారత్ – పాకిస్తాన్ మధ్య యుద్ధం ఆగాలని, దేశంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ ఆలయంలో వేద పండితులు శనివారం శాంతి యాగం నిర్వహించారు. అనంతరం గోశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి కల్యాణ వేడుకలకు అంకురార్పణ

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంలో నిర్వహించే కల్యాణ మహోత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా వేద పండితులు ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు.

జాతీయ రక్షణ నిధికి నెల వేతనం విరాళం


పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: జాతీయ రక్షణ నిధికి ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్న సైనికుల కోసం విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఉగ్రవాదులు దేశంలోకి చొరబడకుండా కాపాడుతున్న సాయుధ దళాలకు అందరూ మద్దతు ప్రకటించాలని కోరారు. తద్వారా వారిలో మనోస్థైర్యం పెరుగుతుందన్నారు.

సంపద పేదలకు పంచితే అన్యాయమా?

- రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు
- దొరల పాలన కోసం దోపిడీదారులు ఏకమవుతున్నారు..
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


సబ్‌స్టేషన్ల పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి తదితరులు


అశ్వారావుపేట : రాష్ట్రంలో సంపద సృష్టించి పేదలకు పంచడం అన్యాయమా అని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రశ్నించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో రూ.40 కోట్లతో నిర్మించనున్న ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శనివారం స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'దొరల పాలన కోసం దోపిడీదారులు ఏకమవుతున్నారు.. తస్మాత్ జాగ్రత్త..' అంటూ హెచ్చరించారు. ప్రజల వద్ద డబ్బు లాగి దోపిడీ చేసేందుకు తాము అధికారంలోకి రాలేదని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వెల్లడించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రజలను జలగల్లా పీల్చేసిందని, కేసీఆర్ అడ్డగోలుగా సంపాదించిన డబ్బుతో సభలు నిర్వహిస్తూ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. గడిచిన పదేళ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చారా.. దళితులకు మూడెకరాల భూమిచ్చారా.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారా.. అని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు తెచ్చి గోదావరిలో పోశారని ఆరోపించారు. రూ.7లక్షల కోట్ల అప్పు తమ ప్రభుత్వం మీద పడేసినా, సంక్షేమ పథకాల అమలులో వెనుకడుగు వేయడం లేదన్నారు. గిరిజనుల వ్యవసాయం కోసం రూ.12,500 కోట్లతో ఇందిర జల వికాస్ పథకం ప్రవేశపెడుతున్నామని, ఈనెల 18న నాగర్‌కర్నూల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, అదే రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పథకంలో గిరిజన రైతులకు సోలార్, డ్రిప్, ఉద్యాన మొక్కలు ఉచితంగా అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పేదల కళ్లలో ఆనందం చూడటమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం వెనుకబడి ఉందని, అందుకే విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుతో రైతుల కళ్లలో వెలుగులు చూడనున్నామని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రతి తండాకు, గ్రామానికీ నాణ్యమైన విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, ఇప్పుడు మరింత మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం కోళ్ల ఫారాల్లో, పాడుపడిన రైస్ మిల్లుల్లో గురుకులాలు నిర్వహిస్తే, తాము 25 ఎకరాలకుపైగా స్థలంలో ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు రూపకల్పన చేశామన్నారు. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఐటీడీఏ పరిధిలో కోటాకు మించి ఇస్తున్నామని ప్రకటించారు. సమాచార శాఖ ద్వారా గత ప్రభుత్వం అసత్య ప్రచారాలకు రూ.1,052 కోట్లు దుర్వినియోగం చేసిందన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్, ఐడీసీ, గిడ్డంగుల సంస్థ చైర్మన్లు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వర రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసమే..

అశ్వారావుపేటరూరల్ : భవిష్యత్‌లో మరింత నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అందుకే అశ్వారావుపేట నియోజకవర్గానికి రూ.40 కోట్లతో ఆరు సబ్‌స్టేషన్లు మంజూరు చేశామని చెప్పారు. మారుమూల అటవీ ప్రాంతాల్లోని రైతులు, గిరిజనులకు నాణ్యమైన విద్యుత్ వెలుగులు అందించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారని, దీంతో సబ్‌స్టేషన్లు మంజూరు చేశామని వెల్లడించారు. అశ్వారావుపేట మండలం ఆసుపాకలో రూ.24.46 కోట్లతో 400/220 కేవీ, కావడిగుండ్లలో రూ.2.24 కోట్లు, అచ్యుతాపురంలో రూ.3.10 కోట్లు, తిరుమలకుంటలో రూ.3.15 కోట్లు, అశ్వారావుపేట-2 కింద రూ.2.53 కోట్లు, దమ్మపేట మండలం పార్కలగండిలో రూ.2.24 కోట్లతో 33/11కేవీ సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ పనులు పూర్తయితే ఆయా గ్రామాల్లోని గృహ వినియోగదారులు, వ్యవసాయ కనెక్షన్లకు లో ఓల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారి 16 నెలలు గడుస్తున్నా.. ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ లక్ష్యం అధికారులకు అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లే క్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఐటీడీఏ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తిరుపతి, షిరిడీకి రైళ్లు నడపాలి

అధికారులకు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి సూచన


రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెంఅర్బన్ : భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి, షిరిడీకి రైళ్లు నడపాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి రైల్వే అధికారులకు సూచించారు. స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలించారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని ప్రశ్నించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లన్నింటినీ తక్షణమే పునరుద్ధరించాలని, కాకతీయ రైలును మణుగూరు వరకు పొడిగించాలంటూ హైదరాబాద్‌లోని రైల్వే అధికారులకు ఫోన్ చేశారు. ఎంపీ వెంట జెడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, నాయకులు ఆళ్ల మురళి, ఊకంటి గోపాల్ రావు, రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాసరెడ్డి, రజాక్, విజయాబాయి, హైమావతి, రాంబాబు ఉన్నారు.

సింగరేణి డైరెక్టర్లతో భేటీ..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్లతో ఎంపీ రఘురాంరెడ్డి సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీకే –7ఓసీ, రొంపేడు ఓసీ తదితర గనుల అనుమతులపై ఆరా తీశారు. సింగరేణి ఆస్పత్రుల్లో సరిపడా వైద్యులను నియమించి కార్మికులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సింగరేణి సీఎస్సార్ నిధులతో సమీప గ్రామాల్లో రోడ్లు, లైటింగ్ వంటి అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ రావు, ప్రాతినిధ్య సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి తైలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా, ఆలయంలో ఈనెల 12న చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. పాల్గొనే భక్తులు రూ. 2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని..

ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికులు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శనివారం ఉదయం పెద్దమ్మతల్లి ఆలయంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో దనియాకుల మానస, బండారి అశ, పసుమర్తి శిల్ప, సంకా స్వాతి, కృష్ణవేణి పాల్గొన్నారు.



యశోద హాస్పిటల్స్

యశోద మెడికల్ సెంటర్

మానస కాంప్లెక్స్ 1వ ఫ్లోర్, పాత బస్టాండ్ దగ్గర, కళ్యాణ్ జ్యువెల్లర్స్ పక్కన, వైరా రోడ్, ఖమ్మం

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
సర్జికల్ గ్యాస్ట్రో వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ పి.బి. పవన్ కుమార్	12-05-2025 2వ సోమవారం
క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ ప్రవంతి రెడ్డి టి	13-05-2025 2వ మంగళవారం
గుండె వ్యాధులకు కన్సల్టేషన్	డా॥ జితేందర్ జైన్	14-05-2025 2వ బుధవారం
కార్డియోథొరాసిక్ & వాస్కులర్ కన్సల్టేషన్	డా॥ విశాల్ వి ఖంటే	14-05-2025 2వ బుధవారం
ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్	డా॥ విశ్వనాథ్ మహాదేవుని	15-05-2025 3వ గురువారం
మెదడు, వెన్నెముక, మరియు నరాల వ్యాధుల కన్సల్టేషన్	డా॥ ఎస్. భరత్ కుమార్	16-05-2025 3వ శుక్రవారం

అపాయింట్‌మెంట్ కొరకు: 08742- 463886 | 707 517 2575 | 707 570 3581

క్లుప్తంగా

ఖమ్మం పెద్దాస్పత్రిపై 'రెడ్‌బ్యాండ్'



ఆస్పత్రి భవనంపై వేయించిన రెడ్‌బ్యాండ్

ఖమ్మంవైద్యవిభాగం: భారత్ – పాకిస్తాన్ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యాన ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల భవనాల టాప్‌పై రెడ్‌బ్యాండ్ గుర్తు వేయిస్తోంది. ఇందులో భాగంగానే ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి స్లాబ్‌పైనా పెద్దసైజ్‌లో తెలుపు రంగు, ఆపై ఎరుపు రంగుతో క్రాస్ గుర్తు వేయించారు. ఈ గుర్తు వేయించడం ద్వారా యుద్ధ సమయాన విమానాలు, హెలికాప్టర్ల నుండి చూసినా కనిపిస్తుందని, ఈ గుర్తు ఉన్నవి ఆస్పత్రులుగా గుర్తించి శత్రుదేశాలు జెనీవా ఒప్పందం ప్రకారం దాడి చేయవని అధికారులు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

దమ్మపేట: అధికారుల సంతకాల ఫోర్జరీతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి అక్రమంగా భూ బదిలీ చేయించుకున్న ఘటనలో ఓ మహిళపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన తూముల ఈశ్వరమ్మ అదే గ్రామానికి చెందిన సాయిల వీర వెంకయ్య అనే వ్యక్తి బతికుండగానే మృతి చెందినట్టుగా నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించింది. ఇందుకోసం అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయించింది. వీర వెంకయ్య కుటుంబంలో తాను కూడా ఓ కుటుంబ సభ్యురాలిగా మరో నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించింది. ఈ ఫోర్జరీ పత్రాలను దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి వీర వెంకయ్య పేరు మీద ఉన్న రెండు ఎకరాల 21 కుంటల భూమిని వారసత్వం ద్వారా గతేడాది మే 22న తన పేరున పట్టా చేయించుకుంది. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలి

డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా


ఫైర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డీడబ్ల్యూఓ లెనినా

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా అన్నారు. శనివారం అశ్వారావుపేటలోని సీడీపీవో కార్యాలయం, అమ్మ సేవా సదనం, ఫైర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అమ్మసేవాసదనాన్ని సందర్శించి అనాథ వృద్ధులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలు గురించి నిర్వాహకురాలు కూరపాటి అనసూయను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ముత్తమ్మ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సౌజన్య, పద్మావతి, వరలక్ష్మి పాల్గొన్నారు.


గురునానక్ యూనివర్సిటీలో విద్యార్థిని ఆత్మహత్య

కుర్నవల్లి గ్రామంలో విషాదం


భావన (ఫైల్)

తల్లాడ: రెక్కాడితే గానీ డొక్క నిండని కుటుంబం.. దంపతులిద్దరూ బ్యాంకులో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ ఇద్దరు కుమార్తెలను కష్టపడి చదివిస్తున్నారు. ఇంతలోనే ఆ తల్లిదండ్రులు పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. తల్లాడ మండలం కుర్నవల్లికి చెందిన అయిలూరి శేషిరెడ్డి – కృష్ణకుమారి దంపతుల చిన్న కుమార్తె భావన (22) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమె శనివారం ఉదయం కళాశాల హాస్టల్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు కారణాలు తెలియరావాల్సి ఉండగా, విషయం తెలియగానే స్థానికంగా విషాదం నెలకొంది. కాగా, భావన 1 నుంచి పదో తరగతి వరకు కల్లూరు ప్రతిభ స్కూల్‌లో, ఇంటర్ ఖమ్మం శ్రీ చైతన్య కళాశాలలో ఉత్తమ మార్కులతో పూర్తిచేసింది. గురునానక్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతుండగా, మొదటి రెండేళ్లు మంచి మార్కులే సాధించింది. ఇంతలోనే ఆమె ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. ఈ విషయం తెలియగానే ఆమె తల్లిదండ్రుల కన్నీరుమున్నీరయ్యారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

మన ఆనందమే తన ఆనందం

- పిల్లల ఎదుగుదలకు అహర్నిశలు శ్రమించే అమ్మ
- నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం



తాను పడిన కష్టాలు పిల్లలు పడకూడదని తల్లి అహర్నిశలు శ్రమిస్తుంది. రెక్కల కష్టంతోనైనా బిడ్డలను ఉన్నతస్థాయికి చేర్చుతుంది. పిల్లలు ఎదిగేవరకు కంటి పాపలా కాపాడుతుంది. ప్రత్యేక అవసరాలున్నా తీర్చుతూ అన్నీ తానై ముందుకు నడిపిస్తుంది. అలాంటి స్ఫూర్తి చాటే కొందరు తల్లులపై మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

● కష్టాలకు ఎదురొడ్డి.. పిల్లలను తీర్చిదిద్ది..


ఇద్దరు కూతుర్లతో మాతృమూర్తి అరుణ

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన చిట్టా అరుణకు ఇద్దరు కుమార్తెలు. 2006లో భర్త సీతారామిరెడ్డి వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. అప్పుడు పిల్లలు చిన్నవారే. కూలి పనులు చేస్తూ జీవనం పోరాటం ప్రారంభించింది. 7వ తరగతి వరకు చదువుకున్న ఆమె భర్త చనిపోయాక ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి పూర్తి చేసింది. 2011లో కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో నైట్ వాచ్‌వుమన్‌గా చేరింది. వచ్చే కొద్దిపాటి జీతం కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు సరిపోలేదు. దీంతో రాత్రి నైట్ వాచ్‌వుమెన్‌గా పనిచేస్తూ ఉదయం కూలి పనులకు వెళ్లింది. అలా ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించింది. తల్లి కష్టాన్ని గమనించిన పిల్లలు గ్రీష్మ, సుష్మా ఉన్నత చదువులు పూర్తి చేశారు. గ్రీష్మ డిప్లొమా పూర్తి ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించింది. చిన్న కూతురు సుష్మా ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసింది. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. భర్త చనిపోయినా అధైర్య పడకుండా ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివించి అరుణ పలువురికి ఆదర్శంగా నిలిచింది.

● అమ్మ ప్రోత్సాహంతో జేఎల్‌గా..


కుమార్తె రమాదేవితో తల్లి సరోజన

కరకగూడెం: భర్త చనిపోయినా మనోధైర్యం కోల్పోకుండా ఓ మహిళ తన కూతురిని ఉన్నత శిఖరాలకు చేర్చింది. అమ్మ కష్టం వృథా కాకుండా కూతురు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మలకం వెంకన్న – సరోజన దంపతులకు రెండో సంతానం రమాదేవి. నిరుపేద కుటుంబం కావడంతో కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించారు. రమాదేవి ఒకటో తరగతి నుంచి బీఈడీ వరకు గురుకుల విద్యాసంస్థలో చదువుకుంది. కాకతీయ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఎంఏ ఆంగ్లం పూర్తి చేసింది. ఇంటర్ చదువుతున్న సమయంలో తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి తల్లి కష్టం, ప్రోత్సాహంతో చదువులో ముందుకు సాగింది. గురుకుల సంస్థ నిర్వహించిన ఉద్యోగాల్లో జేఎల్ ఇంగ్లిష్, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ మ్యాథమెటిక్స్ ఉద్యోగాలకు ఎంపికై పలువురికి అదర్శంగా నిలిచింది. ప్రస్తుతం ఆదిలాబాద్ గురుకులంలో ఇంగ్లిష్ జేఎల్‌గా పనిచేస్తోంది.

● 35 ఏళ్లు వచ్చినా పసిపాపలా..


ప్రణతితో తల్లి రాజమణెమ్మ

సింగరేణి(కొత్తగూడెం): 35 ఏళ్లు వచ్చిన బిడ్డను పసిపాపలా సాకుతోంది. దివ్యాంగురాలైన కూతురిని అన్నీ తానై పోషించుకుంటోంది. కొత్తగూడెం మధుర బస్తీలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి పిండి జయరామ్, రాజమణెమ్మలకు నలుగురు కూతుళ్లు. ఇద్దరు సంపూర్ణ ఆరోగ్యంతో జన్మించగా వారికి వివాహాలు చేశారు. మరో ఇద్దరు దివ్యాంగులు కిరణ్మయి, ప్రణతి జన్మించారు. వారి వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేరు. వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా తల్లితోడు అవసరం. ఇద్దరిని తల్లి రాజమణెమ్మ కంటికి రెప్పలా కాపాడింది. కాగా 2017లో అనారోగ్యంతో కిరణ్మయి మృతి చెందింది. ప్రణతికి ప్రస్తుతం 35 ఏళ్లు. దివ్యాంగురాలు కావడంతో తల్లే అన్ని పనులు చేస్తోంది.

బూడిద నీటి కాలుష్యం!

- పరిసర గ్రామాల ప్రజలకు అనారోగ్య సమస్యలు
- పంటలపై తీవ్ర ప్రభావం.. గోదావరి జలాలు కలుషితం


రామానుజవరం వద్ద గోదావరిలో కలుస్తున్న బూడిద నీరు

పినపాక: భద్రాద్రి పవర్ ప్లాంట్‌తో ఏర్పడిన బూడిద చెరువుతో కష్టాలు తప్పడంలేదు. బూడిద చెరువు కలుషిత నీరు దమ్మక్కపేట కాల్వ ద్వారా గోదావరిలో కలుస్తోంది. బూడిద నీరుతో జలాలు కలుషితమై మోటార్ల ద్వారా వచ్చే నీరు పంట పొలాలను దెబ్బతీస్తోంది. దీంతో దిగుబడి తగ్గిపోతోందని రైతుల ఆందోళన చెందుతున్నారు. బూడిద చెరువు వల్ల తాగునీరు కూడా కలుషితమవుతోంది. బోర్ల నీరు కూడా కలుషితమవుతోంది. మోటార్ల ద్వారా వస్తున్న నీరు బూడిద రంగులో తెల్లగా ఉంటోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆ నీటిని తాగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, దగ్గు, జలుబు, నరాల బలహీనత వంటి రోగాలు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. నీటి కాలుష్యాన్ని నివారించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



బూడిద చెరువు నుంచి వెళ్లే నీటి వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– నాగేందర్, దమ్మక్కపేట

ఎన్జీటీకి ఫిర్యాదు చేస్తాం



బూడిద చెరువుతో నీళ్లు కలుషితమవుతున్నాయి. నీరు గోదావరిలో కలవడంతో చేపలు చనిపోతున్నాయి. పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యపై త్వరలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం.

– రవికుమార్, బీజేపీ నాయకుడు, రామానుజవరం

వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి


పెద్ద బ్రహ్మారెడ్డి (ఫైల్)

పినపాక: మండల పరిధిలోని ఈ.బయ్యారంలో శనివారం వడదెబ్బతో ఉపాధి హామీ కూలి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కీసర పెద్ద బ్రహ్మారెడ్డి(77) ఉదయం ఉపాధి పనికి వెళ్లాడు. ఈ క్రమంలో వడదెబ్బ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో తోటి కూలీలు 108 వాహనంలో మణుగూరు 100 పడకల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేశారు.



కన్నీటిని దిగమింగుతూ దేశ రక్షణకు..

- తండ్రి మరణంతో స్వగ్రామానికి వచ్చిన జవాన్
- యుద్ధం నేపథ్యంలో ఆర్మీ నుంచి పిలుపు


రాంప్రసాద్, ఆర్మీ జవాన్

ఇల్లెందురూరల్: మండలంలోని కట్టుగూడెం గ్రామానికి చెందిన జానబోయిన రాంప్రసాద్ ఆరేళ్ల క్రితం ఆర్మీలో జవాన్‌గా చేరి ప్రస్తుతం జమ్ము సమీపంలోని లద్దాక్‌లో పని చేస్తున్నాడు. ఆయనకు వృద్ధులైన తల్లిదండ్రులతో పాటు మానసిక దివ్యాంగుడైన సోదరుడు ఉన్నారు. కాగా, రాంప్రసాద్ తండ్రి లింగయ్య అనారోగ్యంతో గత నెల 17న మృతిచెందాడు. దీంతో ఆ ఇంటికి పెద్ద దిక్కయిన రాంప్రసాద్ నెల రోజుల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. తండ్రి కర్మకాండలు పూర్తి చేసి, ఇంటిని చక్కదిద్దే పనిలో ఉండగానే పాకిస్తాన్‌తో యుద్ధం మొదలు కావడంతో ఆర్మీ ఉన్నతాధికారుల నుంచి పిలుపు వచ్చింది. దీంతో కుటుంబ బాధ్యతలను పక్కన పెట్టిన రాంప్రసాద్.. శుక్రవారం దుఃఖాన్ని దిగమింగుకుంటూ దేశ రక్షణ కోసం తిరిగి లద్దాక్ బయలుదేరాడు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ.. తండ్రిని కోల్పోయిన దుఃఖంలో ఉన్నానని, కుటుంబాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేద్దామని అనుకున్నానని తెలిపారు కానీ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశరక్షణకే తొలి ప్రాధాన్యం ఇచ్చేందుకు విధులకు బయలుదేరానని చెప్పాడు. రాంప్రసాద్ తల్లి లక్ష్మి మాట్లాడుతూ.. తనకు భర్త చనిపోయిన దుఃఖం ఉన్నప్పటికీ, కుమారుడికి దేశంపై ఉన్న ప్రేమాభిమానాలతో ఆనందంగా పంపించానని వెల్లడించింది.

వైరాలో దొంగల హల్‌చల్

వైరా: వైరాలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వైరాలోని ఖమ్మం – సత్తుపల్లి జాతీయ రహదారి పక్కన మూడు దుకాణాలు, గాంధీచౌక్‌లోని రెండు సెల్‌ఫోన్ దుకాణాలతో పాటు ఓ బియ్యం దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్ దుకాణాల్లో 20 సెల్ ఫోన్లు, బియ్యం దుకాణంలో రూ.5 వేల నగదు, సాయి ధనలక్ష్మి కిరాణంలో రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లగా, మరో దుకాణం షట్టర్ పగలగొట్టారు. ఒకే రోజు ఆరు దుకాణాల్లో చోరీలు జరగడంతో స్థానిక వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రారంభించకముందే 'బోరు'మన్నాయి..!

ఇందిర సౌరగిరి జల వికాస్ పథకానికి తూట్లు


ఇందిర సౌరగిరి పథకం ద్వారా నిర్మించిన బోరు బావి

చండ్రుగొండ : ఇందిర సౌరగిరి జలవికాస్ పథకం ప్రారంభం కాకముందే చతికిలపడింది. పోడు భూముల్లో సాగు నీటి సదపాయం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిర సౌరగిరి జలవికాస్ పథకానికి ఉమ్మడి జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చండ్రుగొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతులమీదుగా శనివారం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే అర్ధంతరంగా డిప్యూటీ సీఎం పర్యటన వాయిదా పడింది. కాగా గ్రామంలో భూముల్లో వేసి బోర్లు పనిచేయకపోడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. రెండు బోర్లల్లో ఒక బోరు మోటారు ఇరుక్కుపోయింది. రెండో బోరు కూలిపోవడంతో నీళ్లు రావడం లేదు. ఒక్కో బోరుకు రూ. 6 లక్షలు వెచ్చించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో రెడ్కో సంస్థ పనులు చేపట్టింది. జియాలజికల్ సర్వే గుర్తించిన ప్రదేశంలోనే బోరుబావులు ఏర్పాటు చేశారు. 270 అడుగులు వేసిన బోర్లల్లో 110 అడుగులు మాత్రమే కేసింగ్ పైప్‌లు దింపారు. అయినా బోర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులైన గిరిజనులు లబోదిబోమంటున్నారు.

మోటారు ఇరుక్కుపోయింది



బోరు బావిలో విద్యుత్ మోటారు ఇరుక్కుపోయింది. ఈ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. మాకేం సంబంధం మోటారు తీయించుకోమంటున్నారు. నా భూమిలో నీళ్లు పారకముందే ఈ పరిస్థితి నెలకొంది.

–రేసు నాగరాజు, లబ్ధిదారుడు, బెండాలపాడు

బోరు కూలిపోయింది



నా బోరు కూలిపోయింది. కేసింగ్ తక్కువ వేయడం వల్లే ఇలా జరిగిందని అనుకుంటున్నాను. అధికారులే నాకు న్యాయం చేయాలి.

–పద్దం వెంకటేష్, లబ్ధిదారుడు, బెండాలపాడు

మూడు రోజుల్లో మస్తానికుంటకు నీరు

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన మంత్రి


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: మండలంలోని సాగర్ ప్రధాన కాల్వపై నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మూడు రోజుల్లో మస్తానీకుంటకు నీరు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలం గడ్డికుంట తండా వద్ద గ్రావిటీ–5 కాల్వ, బావోజీతండా వద్ద ఉన్న రేగులకుంట చెరువును శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్‌లో భాగంగా చెరువులకు నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. తద్వారా రేగుల కుంట చెరువు నిండి అలుగు పారుతూ నల్లకుంట చెరువు, మల్లెపల్లికి చేరుతోందని చెప్పారు. మస్తానీకుంట, మంచుకొండకు కూడా మూడు రోజుల్లో నీరు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రూ.66.33 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 2,400 ఎకరాల ఆయకట్టుకు సాగర్ జలాలు అందుతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఆర్డీఓ జి.నర్సింహారావు, ఇరిగేషన్ ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ, ఏడీఏ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లుతో పాటు మానుకొండ రాధాకిషోర్, వాంకుడోత్ దీపక్, దేవ్ సింగ్, నగేష్, రామ్మూర్తినాయక్, తదితరులు పాల్గొన్నారు. కాగా, అలుగుబారుతున్న రేగులకుంట చెరువు వద్ద మంత్రి పూజలు చేశారు.

స్క్రాప్ దుకాణాల్లో మున్సిపాలిటీ సామగ్రి


పాత ఇనుప దుకాణంలో మున్సిపాలిటీ సామగ్రి

వైరా: మున్సిపాలిటీ కార్యాలయ తాత్కాలిక సిబ్బంది కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీలో పాడైన సామగ్రి పాత ఇనప సామాన్ల దుకాణంలో కనిపిస్తుండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రెండు రోజుల కిందట పాత పంచాయతీ కార్యాలయంలో ఉన్న టన్నుల కొద్ది స్క్రాప్‌ను ఎవరి అనుమతులు లేకుండా మసీద్ కాంప్లెక్స్‌లోని ఓ పాత ఇనుప సామగ్రి దుకాణానికి తరలించినట్లు తెలిసింది. పాడైన ఫాగింగ్ మిషన్లు, పాత ఇనుప సామగ్రి, ప్లాస్టిక్ పైపులను టెండర్ ద్వారా విక్రయించాల్సి ఉంటుంది. కానీ, అలాంటిదేమీ లేకుండా విక్రయించినట్లు సమాచారం. మున్సిపల్ పాలకవర్గం లేకపోవడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ చింతా వేణును వివరణ కోసం యత్నించగా ఆయన స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నందున, ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్తంభాద్రి ఆలయంలో సుదర్శన యాగం


సుదర్శన యాగం నిర్వహిస్తున్న పండితులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం(గుట్ట)లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ సుదర్శన యాగం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలార్చన, పానకాభిషేకం, విశేష పూజలు, బాలభోగ నివేదన అనంతరం పండితులు ప్రత్యేకంగా రుణ విమోచన యోగంగా సంప్రదాయ పద్ధతుల్లో యాగం ప్రారంభించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో పూజలు జరుగుతుండగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, లక్ష్మీనర్సింహస్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం సాయంత్రం గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. కొండ పై ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను బయటకు తీసుకొచ్చి, కొండ చుట్టూ మాడవీధుల్లో గిరి ప్రదక్షిణం చేస్తారని, ఆతర్వాత కొండపై అర్చకులు నక్షత్ర జ్యోతిని వెలిగించనున్నారని ఈఓ వెల్లడించారు.

ఆపరేషన్ సిందూర్‌కు కేఎంసీ మద్దతు

ఖమ్మంమయూరిసెంటర్: భారత ఆర్మీ తలపెట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ఖమ్మం కార్పొరేషన్ పాలకవర్గం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగులు శనివారం ప్రదర్శన నిర్వహించారు. కేఎంసీ కార్యాలయం నుండి ఆర్టీఓ ఆఫీస్ సిగ్నల్ వరకు ప్రదర్శనగా వెళ్లి మానవహారంగా ఏర్పడి సైన్యానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో పాక్ దాడులను భారత సైనం తిప్పికొడుతూ ప్రజల రక్షణకు పాటుపడుతున్నందున ప్రతిఒక్కరు సంఘీభావం తెలపాలని కోరారు. కాగా, దేశ రక్షణనిధికి తనతో పాటు కార్పొరేటర్ల నెల వేతనం రూ.4లక్షల మేర విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహరా, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, బీ.జీ.క్లైమెంట్, రాపర్తి శరత్, దండ జ్యోతిరెడ్డి, గజ్జల లక్ష్మీవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ మమత హాస్పిటల్ రోడ్, ఖమ్మం టౌన్‌లో New 3 BHK 1875 Sft. తూర్పు ఫేసింగ్ 3వ ఫ్లోర్ అన్ని సదుపాయాలతో 100% వాస్తు. రెడీటు ఆక్యుపై. సెల్ : 90104 81234. [SCA 25003280]

TO - LET

■ ఖమ్మం బోసుబొమ్మ సెంటర్‌కార్నర్‌లో (మార్కెట్ దగ్గర 1 షట్టర్ (9.5x25), 2 షట్టర్స్ (13.5x30) తూర్పు ఫేసింగ్ గలవి అద్దెకు ఇవ్వబడును. ఫోన్: 91826 15760 [SCA 25003579]

Services

BUSINESS SERVICES

■ Invest 99,999/- your D Mat, you get daily trading profits and also get 30,000/- worth of GOA trip (5 star accn) free. Offer ends on 15th on this month. Con. 8331048408, 8639121213 [SCA25003583]

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [SCA25003322]

వినికిడి సమస్యా ?

■ 25 సం॥ల అనుభవం కలిగిన ఆడియాలజిస్ట్‌చే వినికిడి పరీక్షకై మరియు అన్ని మోడల్స్‌లో చెవి మిషన్లకై ఫోన్ చేయండి. శ్రవణం హియరింగ్ ఎయిడ్ సెంటర్, హనుమాన్ బస్తీ, కొత్తగూడెం. సెల్: 83418 19114 [M-0983616]

Wanted

■ MG కార్ షోరూం ఖమ్మంలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్, మెకానిక్‌లు కావలెను. సెల్ : 9491402020, 9492628629. [J-535]

■ భారతదేశంలో అత్యంత నమ్మకం మరియు విశ్వసనీయత కలిగిన లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీనందు పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99895 70925, 80748 44986 [SCA 25003467]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీ: 20-25000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1270235]

■ కావలెను. కేర్ టేకర్స్ (M/F), నర్సులు, ఆయాలు విజయవాడలో పేషంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు మరియు షిఫ్ట్‌ల వారిగా చూసుకొనుటకు జీతం+వ+భో. ✆ 91608 35559, 78158 35561 [B-59]

■ 1. Pipe fitter / Structural Fabricator, 2. Pipe welders, 3. Structural Welders, 4. Scaffolders, 5. Painters, 6. Helpers all category KMM, WGL 81060 24624 [SCA 25003533]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15188]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18k Ph: 9640400073, 9160900024 [SCA25003507]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ ఇంటిపని బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కా॥ భో + వసతి + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. Ph: 9989371122, 9515119570 [SCA25003517]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (VJA బ్రాంచ్). శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 8247 500792, 8247500574 [B-1275552]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.